www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 24 మార్చి 2025
5
వైఎస్ఆర్



నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ నెల 24న పిజిఆర్ఎస్ హాలులో నిర్వహిస్తున్నట్లు డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణంగా సభాభవన్‌లో నిర్వహించే కార్యక్రమాన్ని రహదారి కొత్తగా నిర్మిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చు అని తెలిపారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు నిర్వహిస్తామని ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చు అని తెలిపారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన అరటి
- 6,137.5 ఎకరాల్లో దెబ్బతిన్న పంట
- పరిశీలించిన మాజీ ఎమ్మెల్సీ బి.టెక్.రవి
- బాధితులను ఆదుకుంటామని హామీ
- ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నం
- నేడు దెబ్బతిన్న పంటను పరిశీలించనున్న వై.ఎస్.జగన్



దెబ్బతిన్న అరటి పంట

ప్రజాశక్తి- లింగాల/ పులివెందుల టౌన్

లింగాల మండల పరిధిలో శనివారం రాత్రి సంభవించిన గాలివానకు అరటి పంట ధ్వంసమైంది. సుమారు 6,137.5 ఎకరాల్లో పంట దెబ్బతింది. వివరాలు.. మరో నెల రోజుల్లో పంట చేతికి అందే సమయంలో అకాల వర్షానికి మండలంలోని తాతిరెడ్డిపల్లెలో అరటి పంట దెబ్బతింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ, టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.టెక్ రవి ఆదివారం దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకునేలా సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. లక్షలు పెట్టుబడి పెట్టి అరటిని సాగు చేశామని, కన్నబిడ్డలా చూసుకున్న పంట ఇలా ప్రకృతి వైపరీత్యానికి నేలకొరిగిందని బాధిత రైతులు వాపోయారు. నేలకొరిగిన 6,137.5 ఎకరాల పంట వివరాలను, నష్టాలను అంచనా వేసి నివేదిక తయారు చేయాలని ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డికి సూచించారు. నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బాధిత రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మండలంలోని కోమన్నూతల, పార్నపల్లి, వెలిదండ్ల, మూరారిచింతల ,లింగాల, లోపట్నూతల, రామట్లపల్లె, చెర్లోపల్లె, చిన్నకూడాల, పెద్దకూడాల గ్రామాల్లో 825 మంది రైతులకు చెందిన అరటి పంట దెబ్బతిందని అధికారులు గుర్తించారు. గ్రామాల్లోని పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి పంట నష్టంపై ఆరా తీశారు.

దెబ్బతిన్న అరటి పంటను పరిశీలించనున్న జగన్

అకాల వర్షాలకు నేలకొరిగిన అరటి పంటలను సోమవారం వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పరిశీలించనున్నారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి లింగాల మండలంలో 6,137.5 ఎకరాల మేర అరటి పంట నష్టం వాటిల్లింది. మండలంలోని చిన్నకూడాల కోమన్నూతల, తాతిరెడ్డిపల్లి గ్రామాలలో అధిక శాతం పంట నష్టం వాటిల్లింది.

అరటి పంట దెబ్బతినడంతో ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నం

- సుమారు రూ.30 లక్షల నష్టం
- హుటాహుటిన పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించిన బంధువులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

లింగాల మండలం పార్నపల్లె సమీపంలో ఉన్న అరటి పంట శనివారం వీచిన గాలివానకు నేలకొరిగింది. నష్టపోయిన ఇద్దరు రైతులు మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించారు. వివరాలు.. అనంతపురం జిల్లా ఎల్లనూరు మండలం నీర్జంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు లక్ష్మీనారాయణ, చిన్న వెంకటప్ప కడప జిల్లా లింగాల మండలం పార్నపల్లె సమీపంలో పది ఎకరాల్లో అరటి పంటను సాగు చేశారు. శనివారం రాత్రి సంభవించిన గాలివానకు పంట దెబ్బతింది. విషయం తెలుసుకున్న బాధితులు ధ్వంసమైన పంటను పరిశీలించి బోరున విలపించారు. సుమారు రూ. 30 లక్షల నష్టం రావడంతో మనస్తాపానికి గురై పంట పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. విషయం తెలుసుకున్న బంధువులు హుటాహుటిన పులివెందుల ఏరియా ఆసుపత్రి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.



దెబ్బతిన్న అరటిని పరిశీలిస్తున్న బి.టెక్ రవి, నేలకొరిగిన అరటి చెట్టు



చికిత్స పొందుతున్న బాధిత రైతులు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- పన్నులు కడుతున్నాం.. మౌలిక వసతులు కల్పించండి
- సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చిన ప్రజలు
- రామకృష్ణనగర్‌లో ప్రజా చైతన్య యాత్ర



రామకృష్ణ నగర్‌లో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రకు సమస్యలు వెల్లువలా వచ్చాయి. కడప నగరం మూడవ డివిజన్ రామకృష్ణ నగర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో స్థానికులు తమ సమస్యలను సిపిఎం నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. పన్నులు కడుతున్నా.. తమ ప్రాంతానికి కార్పొరేషన్ అధికారులు మౌలిక వసతులు కల్పించలేదని ప్రజలు సిపిఎం నాయకులకు తెలియజేశారు. రామకృష్ణ నగర్‌లో సిపిఎం ప్రచార చైతన్య యాత్రను కడప నగర అభివృద్ధి వేదిక కన్వీనర్ కుమార్ స్వామిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ రామకృష్ణ నగర అభివృద్ధి కోసం ఎన్నికల ముందు రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి సమస్యలను పరిష్కారం చేస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రకాలుగా పన్నులు వసూలు చేసి కార్పొరేషన్ వ్యాపార సంస్థగా మారిందని విమర్శించారు. రామకృష్ణ నగర్‌లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి అర్ధరాత్రి పూట నీళ్లు వదులుతున్నారని, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పేదల కాలనీల పట్ల అధికారులకు చిన్న చూపు తగదని హితవు పలికారు. రామకృష్ణ నగర్ గంగమ్మ గుడి దగ్గర ప్రభుత్వ స్థలాలు భూకబ్జాదారులు యథేచ్ఛగా కబ్జాకు పాలపడుతుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ స్థలాలలో బేస్ మట్టాలు వేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రామకృష్ణ నగర్‌లో సమస్యలు పరిష్కరించకపోతే చలో కార్పొరేషన్ చేపడుతామని హెచ్చరించారు. పర్యటనలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి. దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సీనియర్ నాయకులు ఐ.ఎన్.సుబ్బమ్మ, నగర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, నాయకులు నరసింహ, ఇమ్రాన్, వెంకటేశ్వర్లు, విజయ్, ఉదయ్, వెంకటసుబ్బయ్య, రవి, శ్రీనివాసులు, మహిళా సంఘం నాయకులు కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పోరుమామిళ్ల (కాశినాయన)

ఆదివారం పోరుమామిళ్ల పట్టణంలో వార్డు, వీధుల్లో ప్రజా చైతన్య యాత్రను మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి బైరవప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాత్రలో ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మాట్లాడుతూ స్థానిక రంగసముద్రం పంచాయతీ పరిధిలోని రహమత్ నగర్ కాలనీ, టీచర్ కాలనీలలో సిమెంట్ రోడ్లు లేవని, డ్రెయినేజీ కాలువలు లేవని ప్రజలు తమ దృష్టికి తెచ్చారని చెప్పారు. విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలు, ఇంటిపన్నులు విపరీతంగా పెరిగిపోయి ప్రజలపై భారాలు మోపడంతో పేదల జీవనం కష్టతరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చినా ఫలితం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు కూటమి వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదల కాలనీల్లో తాగు, సాగునీరు, ఉచిత విద్యుత్, డ్రెయినేజీ వంటి మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఇంటిపన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గౌసియా, మేరీ, బీబీ, రవి, ఓబులమ్మ, వెంకటలక్ష్మి, లచ్చుమ, సాయి, ఓబులయ్య పాల్గొన్నారు.



ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు



నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్

చవ్వా విజయశేఖర్‌రెడ్డికి వై.ఎస్.జగన్ నివాళి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సమీప బంధువు, వైఎస్ మనోహర్‌రెడ్డి బావ మరిది, ప్రముఖ పారిశ్రామిక వేత్త చవ్వా విజయ శేఖర్ రెడ్డి శనివారం గుండెపోటుతో అస్వస్థతకు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం బెంగళూరు నుంచి హెలికాప్టర్ ద్వారా పులివెందులకు చేరుకుని పట్టణ పరిధిలో సి.వి సుబ్బారెడ్డి నివాసంలో నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు పరామర్శిం చారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పులివెందులకు వచ్చారన్న విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలవడానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆయన అందరినీ ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో వైఎస్ భారతి, కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి, వైయస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణను విజయవంతం చేయండి


ప్రజాశక్తి - కడప: ఆల్ ఇండియా ముసాయిరా, పుస్తకం ఆవిష్కరణ వేడుక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్ పిలుపునిచ్చారు. కడప నగరంలోని అఫ్జల్‌ఖాన్ కార్యాలయంలో ప్రముఖ ఉర్దూ కవి సయ్యద్ షాయర్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ముషాయిరా పుస్తకం ఆవిష్కరణ వేడుక పత్రాలు ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సయ్యద్ షాయర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న రవీంద్రనగర్‌లోని యుఎస్ మహల్‌లో ఆల్ ఇండియా ముషాయిరా, పుస్తకం ఆవిష్కరణ వేడుక కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో అఫ్జల్‌ఖాన్ జ్యువలర్స్ ఎమ్.డి. ఫవాజ్‌ఖాన్, మొహమ్మద్ షాహిద్, కన్వీనర్లు హాసన్, ముదశిర్, షఫీ, గౌస్, సత్తార్, అఫ్జల్ ఖాన్ యువత సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు రంజాన్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కడప : నగరంలోని గోల్డెన్ సంగం కల్యాణ మండపంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చాన్‌అలీ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ సందర్భంగా పేద ప్రజలకు రంజాన్ కిట్లు ఆదివారం పంపిణీ చేశారు. మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా చేతుల మీదుగా రంజాన్ కిట్లు పేదలకు పంపిణీ చేశారు. పేదలకు రంజాన్ కిట్లు చాన్ అలీ ఆధ్వర్యంలో అందజేయడం అభినందనీయం మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుభాన్ బాష, మాజీ డిసిసి ప్రెసిడెంట్ నజీర్ అహ్మద్, కార్పొరేటర్ బసవరాజు, మాజీ జిల్లా బోర్డు వైస్ ప్రెసిడెంట్ రిజ్వాన్, బాన, మత పెద్దలు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణను అడ్డుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్ ప్రసాద్

కమలాపురం నియోజకవర్గంలో ఉన్న తుమ్మలూరు దళితులకు కేటాయించిన శ్మశాన వాటిక స్థల ఆక్రమణను అడ్డుకోవాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మిషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లెనిన్ ప్రసాద్ ప్రశ్నిం చారు. ఆదివారం అంబేద్కర్ మిషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుమ్మలూరు గ్రామంలో వందల సంవత్సరాల నుంచి దళితులు నివసిస్తూ ఉన్నారని పేర్కొన్నారు. అక్కడ ఉన్నవారిలో ఎవరైన మరణిస్తే మృతదేహాన్ని శ్మశానవాటికలు తీసుకుళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల్లో, బురదలో ఇబ్బందులు పడుతూ పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. మృతదేహాన్ని శ్మశానవాటిక వద్దకు తెస్తే అక్కడ పూడ్చేందుకు వీలులేకుండా ఆక్రమణ దారులు శ్మశానవాటికను ఆక్రమించుకుంటూ ఉన్నారని తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదని చెప్పారు. శ్మశాన స్థలానికి ప్రహరీ నిర్మించాలని కోరారు. ప్రభుత్వం కల్పించాల్సిన సౌకర్యాలు విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయన్ని హ్యూమన్ రైట్స్ కమిషన్, కేంద్ర సామాజిక మంత్రిత్వశాఖకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి
- ఉత్సాహంగా న్యాయశాఖ ఉద్యోగుల బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - కడప



క్రీడలను ప్రారంభిస్తున్న జిలా ప్రధాన న్యాయమూర్తి

నిత్యం పని ఒత్తిడిలో ఉండే న్యాయ శాఖ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని పివిఆర్ ఇండోర్ స్టేడియంలో న్యాయశాఖ ఉద్యోగులకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే న్యాయశాఖ ఉద్యోగులకు ఇలాంటి ఆటల పోటీలు ఉపశమనాన్ని ఇవ్వడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయన్నారు. మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించేందుకు ఆస్కారం లభిస్తుందన్నారు. క్రీడల్లో గెలపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి క్రీడాకారులను పరిచయం చేసుకొని కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. బాబాఫకృద్దీన్, అదనపు న్యాయమూర్తి రామారావు, ప్రభుత్వ ప్లీడర్ శివ శంకర్ రెడ్డి, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ ఎస్. జిలానిబాషా, ఆర్గనైజేషన్ సెక్రటరీ నాగరాజు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - గోపవరం

విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని టిడిపి నాయకులు డాక్టర్ కొంకుల రాంబాబు , వాకో సంస్థ అధ్యక్షులు ఎస్.కె. వసీమ్, కార్యదర్శి జె. వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బద్వేల్ పట్టణంలోని స్థానిక ఎ.వి.ఆర్ పాఠశాల ఆవరణలో జెవిఎస్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకో అంతర్‌జిల్లాల కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడరంగంలో పట్టు సాధించాలన్నారు. కిక్‌బాక్సింగ్ అనేది అనేక సాంప్రదాయ పోరాట క్రీడల అన్నారు. యుద్ధ కళల ఆధారంగా సృష్టించిన ఆధునిక కాంటాక్ట్ ఫైటింగ్ క్రీడ అన్నారు. కిక్‌బాక్సింగ్ అనేది అనేక తూర్పు యుద్ధ కళలకు ఒక ప్రత్యేకమైన పాశ్చాత్య ప్రతిస్పందన అన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు ఏప్రిల్ 5,6 తేదీల్లో కల్లూరులో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ టి సురేష్ బాబు, ఎవిఆర్ స్కూల్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్,తెలుగు యువత నాయకులు కుంకుల రవికుమార్, బ్రహ్మయ్య, తిరుమల కొండయ్య, మస్తాన్,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్స్‌తో జాగ్రత్త : డిఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

బెట్టింగ్ యాప్స్‌తో జాగ్రత్తగా ఉండాలని కడప డిఎస్‌పి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం గౌస్ పేరు సేన ఆధ్వర్యంలో ముద్రించిన బెట్టింగ్ యాప్ వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ బెట్టింగ్ యాప్స్ వలలో పడదు, తక్కువ వ్యవధిలో మంచి లాభాలు ఆశ చూపించి బెట్టింగ్ అనే ఉచ్చులోకి లాగుతారని హెచ్చరించారు. కొందరు పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకుని దిక్కు తోచని పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. గౌస్ పీర్ సేన ఆధ్వర్యంలో బెట్టింగ్స్ యాప్స్ పై అవగాహన కల్పించేందుకు పలు పోస్టర్లు రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో 1 టౌన్ సీఐ రామకృష్ణ, పోస్టర్లను కాంగ్రెస్ సిటీ ప్రెసిడెంట్ అఫ్జల్ ఖాన్, కోఆర్డినేటర్ బండి జకరయ్య, ఐపీఎల్ క్రికెటర్ విజయ్, గౌస్ పీర్ సేన సభ్యులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి వెంకటేశ్వర్లు

యువతకు ఆదర్శం భగత్ సింగ్ : ఎస్ఎఫ్ఐ



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

యువతకు ఆదర్శప్రాయుడు భగత్‌సింగ్ అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి పేర్కొన్నారు. ఆదివారం స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ 94వ వర్ధంతిని స్థానిక ప్రకాష్ నగర్‌లోని ఎస్‌సి హాస్టల్‌లో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ విద్యార్థి, యువతకు భగత్ సింగ్ పోరాట జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. అతి చిన్న వయసులో పోరాటాల వైపు ఆకర్షితులై దేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో గునపంగా మారి తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన విప్లవ యువకిశోరం భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్ దేవ్ అని పేర్కొన్నారు. దేశంలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా బతకాలని, లౌకికవాదం పరిరక్షించాలని, దేశానికి సంపూర్ణమైన స్వాతంత్ర్యం తీసుకురావాలని పోరాటాలు చేసిన భగత్ సింగ్ లాంటి పోరాట యోధుల ఆశయాలకు నేటి పాలకులు నీరుగార్చేలా వ్యవహించడం సరికాదన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజాస్వామ్య స్వేచ్ఛను, రాజ్యాంగ విలువలను హరిస్తూ దేశవ్యాప్తంగా లౌకికవాదాన్ని దెబ్బతీసే విధంగా అనేక కార్యకలాపాలు చేయడం ద్వారా స్వాతంత్ర్య సమరయోధులు పోరాటాన్ని, వారి త్యాగాలు వారు ఆశించిన స్వతంత్ర దేశం నేటి బిజెపి పాలకులు సర్వనాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. బిజెపి అధికారంలో చేపడితే సంవత్సరానికి యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సంస్థలన్నింటినీ అమ్ముతున్నారని, బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి దేశంలోని విద్యార్థి,యువత ప్రతి ఒక్కరూ భగత్ సింగ్ లాంటి పోరాట స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనూ, దేశంలోనూ అనేక విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయమని అడిగిన, పోరాటాలు చేసిన అక్రమ అరెస్టులతో, నిర్బంధాలతో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు. విద్యార్థి, యువతను నమ్మించి మోసపూరితమైన ఎన్నికల హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన పార్టీలకు తగిన గుణపాఠం చెప్పడానికి భగత్ సింగ్ లాంటి నాయకుల పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువత పోరాటాలకు నడం బిగించాలని పేర్కొన్నారు. మన భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అప్పుడే ఇలాంటి నాయకులకు ఘనమైన నివాళి అర్పించినట్లు అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు జాలా సుమంత్, నగర నాయకులు అఖిలేష్, ధన, రాజు, వినయ్, పండు పాల్గొన్నారు.

వేంపల్లె : దేహం కంటే దేశం మిన్న అని నమ్మి దేశ మాత కోసం ప్రాణాలర్పించిన అసలైన దేశ భక్తులు సర్దార్ భగత్‌సింగ్, షహీద్ రాజ్‌గురు, షహీద్ సుఖ్‌దేవ్ అని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులైన సర్దార్ భగత్‌సింగ్, షహీద్ రాజ్‌గురు, షహీద్ సుఖ్‌దేవ్ 94వ వర్ధంతిని వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. వీరి చిత్రపటాలకు తులసిరెడ్డి ఘనంగా నివాళ్ళర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, రమణ, వినయ్ పాల్గొన్నారు.

ఖాజీపేట : భారత స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రఖ్యాత ఉద్యమ కారుడు భగత్‌సింగ్ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండు కూడలిలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, ఖాజీపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ హాజీ గౌస్, ఇస్మాయిల్, చరిత్రకారులు షేక్ ఇంతియాజుద్దీన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్వతంత్ర సాధన కోసం ఉరి కొయ్యలనెక్కిన యోధులు భగత్ సింగ్, రాజ్‌గురు సుఖదేవ్‌కు జోహార్లు అని మాజీ డివైఎఫ్ఐ ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో భగత్‌సింగ్ బ్లడ్ డొనేట్ గ్రూప్, గ్రేటర్ టుడే జాతీయ తెలుగు దినపత్రిక ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గుర్రం డేవిడ్ రాజ్ రక్తదాన శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. రక్తదాన శిబిరంలో భగత్‌సింగ్ బ్లడ్ డొనేట్ గ్రూప్ కార్యదర్శి ఓబులేసు, నాయితుల్లా, వివేక్, హాస్పిటల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి- గోపవరం : తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దుబచర్లలోని గాంధీ కాలనీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండలు వేసి అవమానించిన దుండగులను కఠినంగా శిక్షించాలని పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ౧ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బద్వేల్‌లోని మజ్దూరి యూనియన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ దేశాల సైతం అంబేద్కర్‌ను కొనియాడుతూ ఉంటే, మన దేశంలోని కొందరు ఆయన్ను అవమానించడం క్షమించరాని నేరమని, అలాంటి దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంబేద్కర్ గారిని అవమానపరచడం అంటే భారత జాతీయతను ఈ దేశాన్ని అవమానపరిచినట్లేనని చెప్పారు. సమావేశంలో ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ ఏరియా కమిటీ సభ్యుడు సి.నారాయణ, సంఘమిత్ర జిల్లా అధ్యక్షులు సొద్దల పెంచలయ్య, దళిత సీనియర్ నాయకులు కేశవయ్య, కూకట్‌పల్లి మురళీ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడిగే వెంకటరమణ, దళిత వేదిక జిల్లా కన్వీనర్ ఓబులేష్, ఒ.ఎస్.వి ప్రసాద్, మాల మహానాడు నాయకులు సుబ్బరాయుడు, రామయ్య పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కడప : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డిడియుజికెవై పథకం ద్వారా సీడప్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ ద్వారా జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు 4 నెలల కాలవ్యవధిలో ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్టు ఆ సంస్థ రీజినల్ కో-ఆర్డినేటర్ ఎన్. సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు పదవ తరగతి లేదా ఐటిఐ ఉత్తీర్ణత, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌కు ఇంటర్ లేదా డిగ్రీ, సైన్స్ బ్యాక్‌గ్రౌండ్ ఉత్తీర్ణత ఉండాలన్నారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్‌కు ఇంటర్ ఉత్తీర్ణత, బ్యూటీ థెరపీ పదవ తరగతి ఉత్తీర్ణత కలిగిన వాళ్లు శిక్షణ కోర్సులకు అర్హులు అని తెలిపారు.అదనంగా బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ నేర్పుతారని తెలిపారు. . శిక్షణ ౨ సమయంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం గుర్తించిన సర్టిఫికెట్ అందిస్తారని, అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9063082227, 9966448807, https://niharskill.com/enroll లింకు ద్వారా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కుండల తయారీకి పుట్టినిల్లు పెద్దశెట్టిపల్లె

వేసవిలో పేదవాడి ఫ్రిజ్‌కు భలే గిరాకీ.. ఇతర జిల్లాలకూ ఎగుమతి.. కొనసాగుతున్న కులవృత్తి


కులవృత్తిని కొనసాగిస్తున్న పెద్దశెట్టిపల్లె వాసులు

ప్రజాశక్తి - చాపాడు

పేదవాడి ఫ్రిజ్‌గా పేరు గాంచిన మట్టితో తయారు చేసిన కుండలు, బానలు, ఇతర పాత్రలకు వేసవిలో భలే గిరాకీ ఉంటుంది. వీటికి పుట్టినిళ్లుగా మైదూకూరు మండలం పెద్దశెట్టిపల్లె గ్రామం పేరుగాంచింది. నేటి ఆధునిక కాలంలోకి విద్యుత్, ప్లాస్టిక్ పరికరాల రాకతో మట్టి పాత్రలకు ఆదరణ తగ్గింది. అయినా తమ వంశ పారంపర్యంగా వస్తున్న వత్తిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా 40 కుటుంబాల వారు కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నో గ్రామాల్లో కులవృత్తిని వదిలి వివిధ రంగాల్లో స్థిరపడిన పెద్దశెట్టిపల్లె వాసులు సమాజానికి తమ ఉనికిని తెలియజేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటిల్లిపాది మట్టి పాత్రల తయారీలో నిమగ్నమవుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతులు చేపడుతూ బతుకు బండిని లాగిస్తున్నారు. వేసవిలో మట్టి కుండలోని నీటికి ఆదరణ ఉండడంతో మరింత ఉత్సాహంగా కుండల తయారీ చేపడుతున్నారు. వేసవి అనగానే చల్లని నీటిని అందించే మట్టి కుండలు గుర్తుకు వస్తాయి. జిల్లాలో కుండల తయారికి కేరాఫ్ పెద్దశెట్టిపల్లె. ఆములో కాల్చి బయటకు తీసిన తాజా కుండలు ఎండలను ఎదుర్కొనేలా సిద్ధం చేస్తున్నారు. మైదుకూరు– బద్వేలు రోడ్డులో పెద్దశెట్టిపల్లె గ్రామం మైదుకూరుకు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గతంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మట్టి పాత్రల తయారీ చేసేవారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తట్టుకోలేక వృత్తిని వదులుకున్నారు. ప్రస్తుతం పెద్దశెట్టిపల్లెలో అధిక కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో బద్వేలు సమీపంలోని పాలెంపల్లె, ప్రొద్దుటూరు వద్ద కల్లూరు, చౌడురు, మైదుకూరు పట్టణంలో ఒకటి రెండు కుటుంబాలు మాత్రమే కుండల తయారీని కొనసాగిస్తున్నారు. ప్రతి రోజూ ఇంటిళ్లపాది కష్టపడితే 15కుండల వరకు సిద్ధం చేయవచ్చని వృత్తిదారులు పేర్కొంటున్నారు. 10రోజులపాటు సిద్ధం చేసిన వాటిని ఒకరోజు బట్టిలో ఉంచి కాల్చుతారు. వీటిని విక్రయిస్తారు. ఒక కుండ రూ.100 వరకు ధర పలుకుతుంది. ఆ మేరకు ప్రతి రోజు రూ.5వందల వరకు కూలి ఉంటుందని పేర్కొంటున్నారు.

కుండల తయారీ ద్వారానే ఉపాధి..

ఎన్నో ఏళ్లుగా కుండల తయారీ ద్వారానే ఉపాధి పొందుతున్నాం. ఫ్రిజ్‌లు, వివిధ రకాల స్టీల్ పాత్రలు వచ్చిన తర్వాత మట్టి పాత్రల వాడకం తగ్గింది. కొన్ని ప్రాంతాల్లో చాలా మంది వృత్తికి దూరమయ్యారు. తమ గ్రామంలో మాత్రం సాధారణ సమయంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ వృత్తిని కొనసాగిస్తున్నాం. వేసవిలో మట్టి కుండలకు మంచి గిరాకీ ఉంటుంది. ఇతర ప్రాంతాల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు.

- శ్రీనివాసులు, పెద్దశెట్టిపల్లె

ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాం..

తయారు చేసిన పాత్రలు, కుండలు గతంలో గ్రామాలకు వెళ్లి అమ్మకాలు చేపట్టేవాళ్లం. ప్రస్తుతం రాయిచోటి, ప్రొద్దుటూరు, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడికే వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ సమస్య లేదు.. ఉపాధికీ ఇబ్బంది లేదు. ప్రభుత్వం నుంచి మట్టి సరఫరా, మార్కెటింగ్‌కు సహకారం అందిస్తే ప్రోత్సాహకరంగా ఉంటుంది.

- జి.సుబ్బరాయుడు, పెద్దశెట్టిపల్లె


తయారైన కుండలు



యశోదకు సేవా రత్న అవార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

కోటపాటి యశోదకు సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - వేంపల్లె

భవిత కేంద్రంలో విభిన్నప్రతిభావంతులకు చేస్తున్న సేవలను గుర్తించి కెసి పుల్లయ్య ఫౌండేషన్ వారు వేంపల్లెకు చెందిన కోటపాటి యశోదకు సేవా రత్న అవార్డు అందజేశారు. ఆమె విభిన్నప్రతిభావంతులకు 20ఏళ్లుగా సేవలు చేసిన సందర్భంగా ఆదివారం ప్రొద్దుటూరులో కెసి పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా రత్న అవార్డు ప్రదానం చేశారు. ఆ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఐఇఆర్టీ కోటపాటి యశోదకు సేవా రత్న అవార్డు అందజేశారు. సన్మానించి, చెక్కును అందజేశారు. తమిళనాడు చెందిన అర్మెల్ల్ వల్లికి కళారత్న, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాసిరెడ్డి వంశీకృష్ణకు హరిత రత్న, తెలంగాణకు చెందిన ప్రభాకర్‌రెడ్డికి విద్యారత్న, రాయలసీమకు చెందిన కోటపాటి యశోదకు సేవారత్న అవార్డులు ఇచ్చారు. సేవా రంగంలో మరింత రాణించాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆకాంక్షించారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి కెసి పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించడం అభినందనీయమని తెలిపారు. కెసి పుల్లయ్య ఫౌండేషన్ కార్యదర్శి అనిల్‌కుమార్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు సేవా రత్న అవార్డులు ప్రదానం చేసి గౌరవించామన్నారు. యశోద సేవలు ఆదర్శనీయమని తెలిపారు. తనకు సేవా రత్న అవార్డు రావడం సంతోషంగా ఉందని యశోద పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు టంగుటూరి మారుతి ప్రసాద్, తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, సిఇఒ చల్లా సుధా, కెసి పుల్లయ్య ఫౌండేషన్ ప్రతినిధులు కృష్ణవేణమ్మ పాల్గొన్నారు. ఐఇఆర్టీ యశోదకు సేవా రత్న అవార్డు రావడం పట్ల జిల్లా సమన్వయకర్త రమణమూర్తి, ఎంఇఒ జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్, భవిత కేంద్ర సిబ్బంది, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక సుంకేసుల రోడ్డులో ఉన్న కసూర్బా పాఠశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఇఒ నాగ స్వర్ణలత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బాలికలందరూ ఏప్రిల్ 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం రైతుల కోసం యాంత్రీకరణ పథకం ద్వారా 50శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలను మంజూరు చేస్తుందని ఎఒ నాగార్చన తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆమె మాట్లాడుతూ అర్హతగల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇ-కర్షక్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఎఒ సూచించారు.

ఎంబార్కేషన్ పాయింట్ రద్దును ఆపడంలో ప్రభుత్వం వైఫల్యం : మునీర్ బాషా

ప్రజాశక్తి - వేంపల్లె



హజ్ యాత్రకు వెళ్లే విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని ఆపడంలో కూటమి ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందని మాజీ రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మునీర్ బాషా పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలే కరులతో మాట్లాడుతూ గతంలో హజ్ యాత్ర చేయ డానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యాత్రికులు హైదరా బాద్, బెంగళూరు నుండి వెళ్లేవారని చెప్పారు. అప్పటి డిప్యూటీ సీఎం అంజా ద్‌బాషా, ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం ఆంధ్రప్రదేశ్ నుండి వెళ్లే హజ్ యాత్రికుల సౌకర్యార్థం కోసం ఎంబార్కేషన్ పాయింట్ రాష్ట్ర నడిబొడ్డున ఉన్న విజయవాడ కేంద్రంగా ఉండాలని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోరారన్నారు. గత సిఎం ఆదేశానుసారం డిప్యూటీ సీఎం, హజ్ కమిటీ చైర్మన్ అప్పటి కేంద్ర ఏవిషియన్ మంత్రి స్మృతి ఇరానీని పలుమార్లు కలిశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం వల్ల విజయవాడకు ఎంబార్కేషన్ పాయింట్ ఇచ్చారన్నారు. 2022 వరకు కరోనా ఉన్న కారణంగా హజ్ యాత్ర రద్దు అయిందన్నారు. 2023లో విజయవాడలో హజ్ హౌస్ లేకపోయినా కూడా గుంటూరు వద్ద ఉన్న నంబూరు మదరసాలో సకల ఏర్పాట్లు చేసి, దాదాపు రూ.14 కోట్లు వెచ్చించరన్నారు. హజ్ యాత్రకు వెళ్లే దాదాపు 2,800 మంది హాజీలను ఎలాంటి లోటు లేకుండా విజయవాడ నుండి పంపారన్నారు. హజ్ యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.80 వేల రాయితీ ఇచ్చిందన్నారు. 2024లో కూడా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి పంపారన్నారు. ఎన్నికల కోడ్ వల్ల యాత్రికలకు రావాల్సిన సబ్సిడీ అమౌంట్ ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు పది మాసాలైనా ఇప్పటివరకు హజ్ యాత్రికులకు సబ్సిడీ డబ్బు ఇవ్వలేదని విమర్శించారు.

ఆర్‌టిసి ప్రయివేటీకరణ ఆపాలి :సిఐటియు

మదనపల్లె అర్బన్ : ఆర్‌టిసి ప్రత్యక్ష పరోక్ష ప్రయివేటీకరణ ఆపాలని సిఐటియు జిల్లా కోశాధికారి హరిశర్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై సిఐటియు అనుబంధ ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రచురించిన బుక్‌లెట్, కరపత్రాలను ఆదివారం స్థానిక ఆర్‌టిసి ప్రాంగణంలో విడుదల చేసి ఆర్‌టిసి కార్మికులకు పంపిణీ చేశారు. విద్యుత్ బస్సుల కొనుగోలు పేరుతో ప్రయివేటు ఓనర్లకు పలు రాయితీలు ఇవ్వడాన్ని ఖండించారు. దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని, ఈ బస్సులోని హెచ్చు చార్జీలవల్ల సామాన్యులపై భారం పడుతుందని అన్నారు. పల్లెవెలుగు బస్సులు పెంచితే ఉపయోగకరమని అన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల వల్ల కాలుష్యం తగ్గుతుందనడంలో వాస్తవం లేదన్నారు. బుక్ లెట్స్ చాలా బాగున్నాయని, వాస్తవ పరిస్థితులు, సమస్యలపై ప్రచురించారని పలువురు కార్మికులు ఎస్‌డబ్ల్యూఎఫ్‌ను అభినందించారు. ఢిల్లీలో జరుగనున్న ఆర్‌టిసి ఛలో పార్లమెంటు నిరసన జయప్రదం కావాలని ఆకాంక్షించారు. ఆర్‌టిసి కార్మికులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వారిగోడును పెడచెవిన పెట్టడంతో దేశవ్యాప్తంగా తమ సమస్యలను పార్లమెంటుకు తెలుపుకోవాలని 24న ఛలోఢిల్లీ నిరసన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరవాలన్నారు.లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఆఫ్రీది, జయబాబు, పవన్, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్లు లేక ఇబ్బందులు

ప్రజాశక్తి - చక్రాయపేట

వ్యవసాయ మోటర్లకు విద్యుత్ కనెక్షన్‌లేక ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని గొట్లమిట్ట గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆదివారం టిడిపి మండల ఇన్‌ఛార్జి మహేశ్వరరెడ్డి దృష్టికి తెచ్చారు. చాలా కాలంగా భూ సమస్యలు పరిష్కారం కాక అధికారులు చుట్టూ తిరుగుతున్నామన్నారు. మమ్మల్ని పట్టించుకోలేదని రైతులు వాపోయారు. భూ సమస్య ఉండడంతో కరెంట్ కనెక్షన్ కుడా ఇవ్వలేదని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు మహేశ్వరరెడ్డి సానుకూలంగా స్పందించారు.


మహేశ్వర్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న రైతులు


టిడిపి చేరిన వారితో బీటెక్ రవి

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే టిడిపి లక్ష్యమని ఆ పార్టీ పులివెందుల నియోజవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బీటెక్ రవి) పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అంకాలమ్మ గూడూరులో పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతోందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు స్వచ్ఛందంగా టిడిపిలో చేరుతున్నారన్నారు. అనంతరం బాబురెడ్డితోపాటు మరికొంతమంది పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో వేంపల్లి టిడిపి ఇన్‌ఛార్జి అజ్జుగుట్ట రఘునాథరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో చిన్నారి

అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. నాట్యాచర్యులు డాక్టర్ ఆర్.మానస ఆధ్వర్యంలో మానస నృత్య కళాకేంద్రం, చందు డ్యాన్స్ స్టూడియో, ధర్మవరం వారి చిన్నారులచే నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. ప్రేక్షకులు చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. ప్రేక్షకులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఏర్పాట్లను శిల్పారామం ఫీల్డ్ సూపర్వైజర్ ఇస్మాయిల్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో నత్య శిక్షకు రాలు డాక్టర్ ఆర్.మానస, మాస్టర్ బి.చంద్రశేఖర, సిబ్బంది పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ముగిసిన గేమ్స్ మీట్

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రం కలికిరిలోని జెఎన్‌టియులో 12వ ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ మీట్ - 2025 ను ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు ఉత్కంఠ భరితంగా సాగిన జెఎన్‌టియుఎలో 12వ ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ మీట్-2025 ఆదివారంతో ముగిసింది. వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఆరు క్రీడల్లో తమ ప్రతిభను చాటారు. ముగింపు వేడుకలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో మొదటిసారిగా ఈ క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడానికి తమ కళాశాల సిద్ధంగా ఉందని తెలిపారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడారని, అందరినీ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ త్యాగరాజన్, జేఎన్టీయూఏ అనంతపురం ఫిజికల్ డైరెక్టర్ జోజీ రెడ్డి, వివిధ విభాగాల హెచ్ఒడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ కళాశాల నుంచి పాల్గొన్న విద్యార్థులు విజేతలుగా నిలిచారు. టేబుల్ టెన్నిస్ (పురుషుల సింగిల్స్) విజేత - జెఎన్‌టియుఎ అనంతపురం, రన్నర్-ఎన్.బి.కె.ఆర్ నెల్లూరు, టేబుల్ టెన్నిస్ (పురుషుల డబుల్స్) విజేత జెఎన్‌టియుఎ అనంతపూర్, రన్నర్స్ ఎన్‌బికె ఆర్ నెల్లూరు, టేబుల్ టెన్నిస్ (మహిళల సింగిల్స్): విజేత - జెఎన్‌టియుఎ అనంతపురం, రన్నర్ -ఎన్‌బికెఆర్ నెల్లూరు. టేబుల్ టెన్నిస్ (మహిళల డబుల్స్): విజేత - జెఎన్‌టియుఎ అనంతపురం, రన్నర్-జెఎన్‌టియుఎ పులివెందుల, బ్యాడ్మింటన్ (మహిళల సింగిల్స్): విజేత - కెఎంఎం తిరుపతి, రన్నర్-జెఎన్‌టియుఎ అనంతపురం, బ్యాడ్మింటన్ (మహిళలడబుల్స్): విజేత-కెఎంఎం తిరుపతి, రన్నర్-గౌతమి ప్రొద్దుటూరు, బ్యాడ్మింటన్ (పురుషుల సింగిల్స్): విజేత- మిట్స్ మదనపల్లి, రన్నర్- ఎస్ఆర్ఇసి నంద్యాల. బ్యాడ్మింటన్ (పురుషుల డబుల్స్): విజేత - మీట్స్ మదనపల్లి, రన్నర్ - విశ్వోదయ కావలి. త్రోబాల్ (మహిళలు): విజేత- మిట్స్ మదనపల్లి, రన్నర్ -జెఎన్‌టియుఎ కలికిరి. హ్యాండ్ బాల్ (మహిళలు): విజేత - జెఎన్‌టియు పులివెందుల, రన్నర్ - ఎన్‌బికెఆర్ నెల్లూరు. వాలీబాల్ (మహిళలు): విజేత- ఎస్‌విసిఇ తిరుపతి, రన్నర్-జెఎన్‌టియుఎ అనంతపురం, ఖోఖో(పురుషులు): విజేత -జెఎన్‌టియుఎ కలికిరి, రన్నర్- కెఎస్ఆర్ఎం కడప.హ్యాండ్ బాల్ (పురుషులు): విజేత-సిద్ధార్థ పుత్తూరు, రన్నర్-జెఎన్‌టియుఎ కలికిరి, వాలీబాల్ (పురుషులు): విజేత- సిద్ధార్థ పుత్తూరు, రన్నర్-మిట్స్ మదనపల్లి. ఓవరాల్ ఛాంపియన్ షిప్ టైటిల్: జెఎన్‌టియుఎ అనంతపురం (50 పాయింట్లు) నిలిచారు. గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు బహుమతులు ప్రధానం చేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం పారిశుధ్య కార్మికులకు ఇమాం నగర్‌లో టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు మహబూబ్ షరీఫ్, గోటూరు నాగభూషణం, భాస్కర్, వెంకటేష్, టిడిపి యూత్ నాయకుడు సోహెల్, హర్షద్ పాల్గొన్నారు.


కార్మికులకు దుస్తులు అందజేస్తున్న టిడిపి నేత షబ్బీర్

అర్థరహిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

టిడిపి తరపున పులివెందుల ఎమ్మెల్యేగా నీవు పోటీ చేసినప్పటి నుంచి తాము ఎన్నికలు వచ్చినప్పుడల్లా బూత్‌ల్లో తిరుగుతూ.. కౌంటింగ్ కేంద్రాలకు కూడా వెళ్లే వారమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డిని ఉద్దేశించి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సతీష్ కుమార్‌రెడ్డి నీ చరిత్ర.. నీ రాజకీయం అన్నీ తెలుసునని అన్నారు. చంద్రబాబును, లోకేష్‌ను విమర్శించే నైతిక విలువలు సతీష్‌కు లేవన్నారు. ఒకప్పుడు వైఎస్ కుటుంబాన్ని విమర్శించి, ఈరోజు వారి భజన చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి మెప్పు పొందడానికి ఇష్టానుసారంగా చంద్రబాబు గురించి మాట్లాడుతున్నావని అన్నారు. 1995 నుండి 2019 వరకు తెలుగుదేశం పార్టీలో ఎన్నో పదవులు అనుభవించావన్నారు. ఎమ్మెల్సీని చేసి డిప్యూటీ శాసనమండలి చైర్మన్‌గా చేస్తే, ఈరోజు ఇష్టానుసారంగా తెలుగుదేశం పార్టీపై మాట్లాడడం సిగ్గుగా లేదా అన్నారు. ఆనాడు నీవు నిలబడిన ప్రతి ఎన్నికల్లో నీపై నమ్మకం లేకనే ప్రజలు నిన్ను గెలిపించలేదన్నారు. వైసిపి అధికార ప్రతినిధిగా ఉండి సమస్యలపై ఏనాడైనా మాట్లాడావా అని ప్రశ్నించారు. ముఖ్యంగా మీ వేంపల్లి తాగునీటి సమస్యపైన స్పందించలేదన్నారు. ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే మీ ఎంపీని అడిగి నిధులు ఇప్పించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపించాలన్నారు. నీ నీచ రాజకీయం ఆనాడు పార్టీలో మేము దగ్గరుండి చూశామన్నారు. ఆనాడు వేల్పుల దగ్గర జరిగిన సంఘటనలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్యాయంగా మమ్మల్ని ఇరికించారని గగ్గోలు పెట్టావే, మరి ఈనాడు జగన్ మోహన్ రెడ్డి నీకు దేవుడయ్యాడా అని ప్రశ్నించాడు. నిన్ను నమ్మి ఆనాడు మేము ఎన్నో సాధక బాధలు అనుభవించామన్నారు. మా ఆస్తులు కూడా పోగొట్టుకున్నామన్నారు. అన్యాయంగా మనపైన జగన్మోహన్ రెడ్డి ఆనాడు కేసులు పెడితే అడవుల్లో తల దాచుకోవడం నీకు గుర్తులేదా అన్నారు. ఆరోజు చంద్రబాబు నాయుడు లేకుంటే మనం ఎక్కడ ఉండే వారెమో గుర్తు చేసుకోవాలన్నారు. ఇకపై మా నాయకుడిపై నువ్వు విమర్శలు చేస్తే తగిన రీతిలో బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో కడప పార్లమెంటరీ కార్యవర్గ సభ్యుడు వజ్రా మైసూరారెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్వరరెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, మహేశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

ఇకెవైసికి గడువు పెంచాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

రేషన్‌కార్డు లబ్ధిదారులు ఇకెవైసి చేయించుకునేందుకు గడువు పెంచాలని పలువురు కోరుతున్నారు. ఇకెవైసి చేయించుకునేందుకు ప్రభుత్వం ఈనెల 31 చివరి గడువుగా విధించింది. పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారని, ఈ సమయాన్ని ఏప్రిల్ 30 వరకు పెంచాలని రేషన్ కార్డు లబ్ధిదారులు, నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలని సూచిస్తున్నారు. ఆ మేరకు ప్రభుత్వాన్ని కోరనున్నట్లు మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టేం శ్రీరాముల యాదవ్ పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

క్రికెట్ బెట్టింగ్, గంజాయి సేవించడం, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి భావన హెచ్చరించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున మండల పరిధిలోని అమృత్‌నగర్‌లో డిఎస్‌పి ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా అమృత్‌నగర్‌లో ఉన్న అనుమానితులు, రౌడీలు, గంజా సేవించే వారు, అమ్మేవాళ్లు, బెల్ట్‌షాపు నిర్వహించే వారి ఇళ్లల్లో సోదా చేశారు. వాహనాల తనిఖీలో నంబర్ ప్లేట్, డాక్యుమెంట్స్ లేని వాహనాలను సుమారు 45 మోటర్ సైకిళ్లను, మూడు ఆటోలు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. వీటిని ఆర్‌టిఐ అధికారులకు తగు చర్య నిమిత్తం పంపినట్లు డిఎస్‌పి భావన తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులకు డిఎస్‌పి కార్నర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రూరల్ సిఐ బాలమద్దిలేటి, ఎస్ఐలు మహ్మద్ రఫీ, వెంకట సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలకు సూచనలిస్తున్న డిఎస్‌పి భావన

క్రైం కార్నర్


మృతి చెందిన తలారి రామచంద్రయ్య

కారు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని టంగుటూరు మెట్ట వద్ద ఆదివారం ఉదయం కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన తలారి దానమయ్య (46) బైకుపై నంద్యాల జిల్లా చాగలమర్రికి వెళుతుండగా.. టంగుటూరు గ్రామ మెట్ట వద్దకు రాగానే వెనుక నుండి కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో దానమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోడ కూలిన సంఘటలో గాయపడిన వ్యక్తి..

ప్రజాశక్తి - లింగాల

జెసిబి యంత్రంలో పాత ఇంటిని కూల్చేస్తుండగా గోడకూలి మండల పరిధిలోని ఎగువపల్లెకు చెందిన దుబ్బల రామచంద్రారెడ్డి (69) శనివారం త్రీవంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు రామచంద్రారెడ్డి కుమారుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. నూతన ఇంటి నిర్మాణం కోసం పాత ఇంటిని కూల్చి వేసే సమయంలో వెనక గోడ కూలి మీద పడిందన్నారు. చికిత్స నిమిత్తం పులివెందులలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం కడపకు రెఫర్ చేశారన్నారు. ఇంటి పెద్ద కోల్పోవడంతో కుంటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది.